

స్నపన తిరుమంజన సేవ

కొమ్మాది: రుషికొండలోని టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో రెండో రోజు స్నపన తిరుమంజన సేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు.



ఆరుద్ర కవిత పుస్తకావిష్కరణ

విశాఖ విద్య: ఏయూలో జరిగిన ఆవంత్స, ఆరుద్ర శత జయంత్యుత్సవాల్లో 'ఆరుద్ర కవిత' పుస్తకాన్ని వీసీ ఆచార్య శశిభూషణరావు ఆవిష్కరించారు.



తిరుమలేశునికి విశేష పూజలు

అక్కిరెడ్డిపాలెం: విశాఖ షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో మంగళవారం బాలాజీని దర్శించుకుని భక్తులు పులకించిపోయారు.



దేవాలయాలపై ప్రభుత్వాల అజమాయిషీ వద్దంటూ పురోహితుల నిరసన



గండి బాబ్జీ భూ ఆక్రమణల నుంచి కాపాడాలని కోరుతున్న బాధితులు



సమస్యలపై గళమెత్తిన సచివాలయాల హెల్త్ సెక్రటరీలు



సమస్యలు పరిష్కరించాలని వెలుగు వీవోఏల ప్రదర్శన

ఆవేదన ఆగ్రహం

అన్ని వర్గాల ఆందోళన బాట

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతుల వెల్లువ
- ఎన్నికల హామీల అమలు కోసం రోడ్డెక్కిన పలు వర్గాల ప్రజలు
- జనంలో పెరుగుతున్న అసంతృప్తి సెగలు

6 నెలలైనా కాలేదు..
6 వేల ఫిర్యాదులు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా కాలేదు.. జనంలో పేరుకున్న అసంతృప్తి సెగలు కక్కుతోంది. సమస్యలు పరిష్కరించమని గొంతెత్తి నినదిస్తున్నారు. అన్యాయాల నుంచి రక్షించమని వేడుకుంటున్నారు. అక్రమాలను అరికట్టమని డిమాండ్ చేస్తున్నారు. అందుకు వారం వారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'లో అధికారులకు అందుతున్న ఫిర్యాదులే సాక్ష్యం. ఇంతవరకు కలెక్టరేట్‌కు 5,982 అర్జీలు అందాయి. ఇంకా మండల రెవెన్యూ కార్యాలయాలకు, ఆర్డీవో కార్యాలయాలకు అందుతున్న వినతులు ఎన్నో.. ఇంకెన్నో.. వచ్చిన ఫిర్యాదు మళ్లీ మళ్లీ రాకుండా శ్రద్ధ తీసుకోమని, వెంటనే పరిష్కరించమని కలెక్టర్ వారం వారం హెచ్చరిస్తున్నా.. ఫిర్యాదులు పెచ్చుమీరడానికి కారణం ఏమిటి? అధికారుల అలసత్వమా.. ప్రజా ప్రతినిధుల జోక్యమా.. కూటమి పార్టీల నాయకుల పెత్తనమా?

సాక్షి, అనకాపల్లి:

కలెక్టరేట్, తహసీల్దార్ కార్యాలయాలు ధర్నాలకు, నిరసనలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. కూటమి ప్రభుత్వ పాలనలో రాజకీయ జోక్యం ఎక్కువైంది. గతంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేవారు. అధికార పార్టీ నేతల పెత్తనం మచ్చుకైనా కనిపించేది కాదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పరిపాలన న్యాయంగా, పద్ధతిగా, నియమ నిబంధనలకు అనుగుణంగా నడిచేది. ఇప్పుడు పరిస్థితి అందుకు పూర్తి విరుద్ధంగా మారింది. కూటమి పార్టీల నాయకుల మాటే చెలామణీ అవుతోంది. అధికారుల్లో నిర్లిప్తత నెలకొంది. వారు మొక్కుబడిగా ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు అనుగుణంగా నడుచుకోవడం కనిపిస్తోంది. ఫలితంగా ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. వారి వేదన అర్జీలను పరిశీలిస్తే అర్థమవుతుంది. గత ఐదు నెలల్లో కలెక్టరేట్‌కు అందిన ఫిర్యాదులను పరిశీలిస్తే..

ఉచిత ఇసుక ఇస్తామని ఎన్నికలకు ముందు చెప్పిన కూటమి ప్రభుత్వం జనాన్ని మోసం చేసిందంటూ నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలు నిరసనలు, ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల ముందు తమకు రూ.10 వేల జీతం ఇస్తామని హామీ ఇచ్చి.. ఇప్పుడు ఉద్యోగాలే లేకుండా చేశారంటూ గ్రామ వలంటీర్లు ఆందోళనలు చేశారు. ఎన్నికలకు ముందు తమ జీతం రూ.15 వేలు చేస్తామని మాట తప్పారంటూ వీఆర్‌ఏలు ఉద్యమ బాట పట్టారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలంటూ 108, 104 ఉద్యోగులు నిరాహార దీక్ష చేపట్టారు. తమ డిమాండ్లు పరిష్కరించాలంటూ ఆశా వర్కర్లు, సచివాలయ హెల్త్ అసిస్టెంట్లు ఆందోళన చేశారు. అనకాపల్లి శారదానగర్‌లో మద్యం దుకాణం తొలగించాలంటూ స్థానిక ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. విశాఖ– చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం జిల్లాలో సేకరించిన భూములకు సంబంధించి తమకు దక్కాల్సిన నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని నక్కపల్లి మండల ప్రజలు కోరారు.

108 ఉద్యోగుల నిరాహార దీక్ష



నవంబర్ 18: ప్రమాదాలు జరిగిన నిమిషాల్లో ప్రజలకు సేవలందించే 108 సిబ్బందికి తగిన న్యాయం చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని సిబ్బంది కోరారు. ప్రభుత్వమే 108 వ్యవస్థను నిర్వహించి సిబ్బందిని ప్రభుత్వ సిబ్బందిగా గుర్తించాలని, 8 గంటల పని సమయాన్ని 3 షిఫ్టులలో పెట్టాలని, ఈఎంటీలను నియమించాలని, మరణించిన ఉద్యోగికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని వినతి అందించారు.

ఆశా వర్కర్ల నిరసన



నవంబర్ 18: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఆశాలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, పనిభారం తగ్గించాలని, పాడైన సెల్ ఫోన్ల స్థానంలో కొత్త 5 జి సెల్ ఫోన్లు ఇవ్వాలని, రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు, మెడికల్ లీవులు, నాణ్యమైన యూనిఫామ్ ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలని, ఏఎన్ఎం నియామకాల్లో ఆశాలకు వేయిటీజీ మార్కులు ఇవ్వాలని, ఆశాల ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగుల ఆక్రందన



అక్టోబర్ 28, నవంబర్ 4, 11 వరుసగా మూడు వారాలు: దివ్యాంగుల చట్టం–2016 పటిష్టంగా అమలు చేయాలని, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి సౌకర్యం కల్పించాలని కోరుతూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక కమిటీ ఆధ్వర్యంలో దివ్యాంగులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి జగదీష్‌కు వినతి పత్రం అందించారు. అంగవైకల్యం 80 శాతం పైన ఉన్న వారికి రూ.15 వేలు పింఛను ఇవ్వాలని, దివ్యాంగులకు మోటారు, ఎలక్ట్రికల్, ఇతర వాహనాల మంజూరుకు కఠిన నిబంధనలు తొలగించాలని కోరారు. ఒంటరి వికలాంగులకు కూడా రేషన్ కార్డులు మంజూరు చేయాలని, జిల్లా దివ్యాంగుల కార్యాలయాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని, ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం అందించాలని, బ్యాక్ లాగ్‌పోస్టుల భర్తీకి జాబ్ మేళాను నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం జిల్లా కార్యదర్శి బుగిడి నూకఅప్పారావు, కొర్ని సింహచలం, ఎస్.నాగరాజు, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఫార్మా కంపెనీల్లో కార్మికుల భద్రత డొల్ల

యాజమాన్యాల నిర్లక్ష్యం, ప్రభుత్వాల ఉదాసీనతతో కార్మికుల ప్రాణాలు బలి చేసుకుంటున్నారు. సేఫ్టీ ఆడిట్, ఫార్మా కంపెనీల్లో భద్రత ప్రమాణాలు పాటించాలంటూ నిరసన వ్యక్తం చేశారు.

ఏపీఐఐసీ గ్రీవెన్స్‌కు భారీగా వినతులు

విశాఖ– చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణం కోసం సేకరించిన భూములకు సంబంధించి తమకు ఇవ్వాల్సిన నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందించాలని రైతులు కోరారు. నక్కపల్లి మండలం చందనాడ, మూలపర, వేంపాడు, పాటిమీద, బుచ్చిరాజుపేట, డీఎల్‌పురం గ్రామాల నుంచి 532 మంది నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కరించమని వినతులు ఇచ్చారు 2010లో గూగుల్ మ్యాప్‌లో చూపించే ఇళ్లకు మాత్రమే పరిహారం ఇస్తామని అధికారులు అంటున్నారు. కొత్తగా నిర్మించుకున్న ఇళ్లు మ్యాప్‌లో చూపించడం లేదని, వాటిని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

హిందూ దేవాలయాలపై ప్రభుత్వ అజమాయిషీ తగదు

హిందూ దేవాలయాలపై ప్రభుత్వాల అజమాయిషీ పూర్తిగా తొలిగిపోవాలని విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో పురోహితులు నిరసన వ్యక్తం చేశారు. హిందూ ధార్మిక సంస్థలు, స్వామీజీలు, భక్తులకు బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు.

కూటమి నేతల భూఆక్రమణలపై నిరసన

టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ అనుచరుల భూఆక్రమణ నుంచి తమ స్థలాలు కాపాడాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద బాధితులు నిరసన చేపట్టారు. పరవాడ మండలం ఇ.మర్రిపాలెంలో సర్వే నంబర్ 15.16/1లో ఐదెకరాల భూమిని కొనుగోలు చేసి 80 ప్లాట్లుగా లేఅవుట్ వేసి విక్రయించగా... కొనుగోలుదారుల స్థలాల్లో నిర్మించుకున్న పునాదులను కూటమి నేతల అనుచరులు బుల్‌డోజర్లు, జేసీబీలతో అక్రమంగా చొరబడి ధ్వంసం చేశారంటూ నిరసనల వ్యక్తం చేశారు.

సమస్యలపై నినదించిన వీఆర్‌ఏలు



నవంబర్ 4: నిబంధనలకు విరుద్ధంగా వీఆర్‌ఏలను ప్రభుత్వ కార్యాలయాల వద్ద నైట్ వాచ్‌మెన్ల మాదిరి వినియోగించుకుంటూ ఇబ్బందులు పెడుతున్నారంటూ రాష్ట్ర గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద వీఆర్‌ఏలు నిరసన కార్యక్రమం చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరి వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేయాలని, జిల్లాలో ఖాళీగా ఉన్న వీఆర్‌వోలు, అటెండర్, వాచ్‌మన్, రికార్డు అసిస్టెంట్, డ్రైవర్ వంటి పోస్టుల్లో తమను భర్తీ చేసి న్యాయం చేయాలన్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తయిన వీఆర్‌ఏలను వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. వీఆర్‌ఏల జీతాలు రూ.15 వేలు చేస్తామని ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

వలంటీర్లకు అన్యాయం



అక్టోబర్ 21: ఎన్నికల హామీ మేరకు రూ.10 వేల వేతనం అమలు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద వలంటీర్లు నిరసన కార్యక్రమం చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు నిరంతరం సేవలు అందించిన తమకు తీవ్ర అన్యాయం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో రాజీనామాలు చేసిన వలంటీర్లను కూడా విధుల్లోకి తీసుకుని, బకాయిలు విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

మద్యం దుకాణాల సిబ్బంది ఆకలి కేకలు



సెప్టెంబర్ 31: ఉద్యోగ భద్రత కల్పించాలంటూ మద్యం దుకాణాల్లో పనిచేసే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నిరసన ప్రదర్శన చేశారు. 2019లో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల్లో జీవో నెం.7/2022 ప్రకారం సూపర్‌వైజర్, సేల్స్‌మెన్ కేటగిరీల్లో జీతాలు ఇచ్చారని, ప్రస్తుతం ఉద్యోగాలు తీసేయడంతో రోడ్డున పడ్డామని ఆవేదన చెందారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతి ఇచ్చారు.

జగనన్న కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి



సెప్టెంబర్ 31: అనకాపల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మహిళలు జగనన్న కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని నిరసన వ్యక్తంచేశారు. కొత్తూరు గ్రామానికి చెందిన తమకు సంపతిపురం రెవెన్యూ అచ్చియ్యపేట వద్ద స్థలాలు మంజూరు చేయడంతో ప్రభుత్వ సాయానికి తోడు అప్పులు చేసి ఇళ్లను పూర్తి చేసుకుని నివాసముంటున్నామన్నారు. పారిశుధ్యం మెరుగుపరచి, మౌలిక సౌకర్యాలు కల్పించాలని కోరారు.

దోసూరు కుర్రాడు.. క్రికెట్‌లో మెరిశాడు



ఐపీఎల్‌కు ఎంపికైన అవినాష్

అచ్యుతాపురం (మునగపాక): తమ గ్రామానికి చెందిన యువకుడు ఐపీఎల్‌లో అదరగొట్టబోతున్నాడని దోసూరు గ్రామస్తులు మురిసిపోతున్నారు. అచ్యుతాపురం మండలం దోసూరుకు చెందిన పైలా సత్యారావు–నాగమణి దంపతుల చిన్న కుమారుడు అవినాష్ చెన్నైలో ఎంబీఏ చదివాడు. చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. చివరకు ఐపీఎల్ స్థాయికి ఎదిగాడు. పంజాబ్ కింగ్స్ జట్టు తరఫున ఆడనున్న పైలా అవినాష్‌పై అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆ జట్టు అవినాష్‌ను రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులతో పాటు సోదరుడు చరణ్‌తేజ, జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భారత్‌కు ఆడాలని ఆశ

ఐపీఎల్‌కు ఎంపిక కావాలన్న కోరిక నెరవేరింది. ఎప్పటికైనా భారత్ తరఫున క్రికెట్‌లో స్థానం సాధించాలని ఆశ. సోదరుడు చరణ్‌తేజ సహకారం, తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది.

– పైలా అవినాష్, పంజాబ్ కింగ్స్ జట్టు సభ్యుడు

సంతోషంగా ఉంది

మా కుమారుడు అవినాష్ ఐపీఎల్‌కు ఎంపికైనందుకు గర్వపడుతున్నాం. 13 ఏళ్లుగా క్రికెట్‌నే శ్వాసగా భావించాడు. మాది వ్యవసాయ కుటుంబమే అయినా క్రికెట్ ఆడుకునేందుకు అవినాష్‌కు ప్రోత్సాహం అందించాం. అవినాష్ చదువులో కూడా రాణించేవాడు.

–అవినాష్ తల్లితండ్రులు సత్యారావు, నాగమణి

రాజ్యాంగ స్ఫూర్తి.. భావి తరాలకు దీప్తి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్



కశింకోట డీపీఎన్ హైస్కూల్లో విద్యార్థుల మానవహారం

తుమ్మపాల: భారత రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు కల్పించిందని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. భారత రాజ్యాంగం రూపొందించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తి చట్ట పరిధిలో స్వేచ్ఛగా జీవించడానికి వీలు కల్పిస్తూ భారత రాజ్యాంగాన్ని రూపొందించి, 1949 సంవత్సరం నవంబరు 26వ తేదీన నాటి రాష్ట్రపతికి సమర్పించారని తెలిపారు. రాజ్యాంగంలో వ్యక్తి స్వేచ్ఛ, హక్కులతో పాటు విధులు కూడా పొందుపరిచారన్నారు. అందువల్ల బాధ్యతలను కూడా స్వీకరిస్తూ, దేశ అభివృద్ధికి, సమైక్యతకు పాటుపడాలన్నారు. జేసీ ఎం.జాహ్నవి మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి న్యాయం, సామాజిక, ఆర్థిక, సంక్షేమ ఫలాలు అందేలా డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాణం చేసినట్లు తెలిపారు. డీఆర్వో బి. దయానిధి, కె.కె.ఆర్.సి.స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.ఎస్. సుబ్బలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలనాధికారి బి.వి.రాణి, జిల్లా పౌర సరఫరాల అధికారి కె.వి.ఎల్.ఎస్.మూర్తి, కలెక్టరు కార్యాలయ సెక్షను సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల మానవహారం

కశింకోట: డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులు మానవహారం నిర్వహించి రాజ్యాంగానికి కట్టుబడతామని ప్రమాణం చేశారు. రాజ్యాంగం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు.

సమానత్వం అంబేడ్కర్ పుణ్యమే..

మాడుగుల: ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగ వ్యవస్థ ఉన్న దేశం భారత దేశమని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండ్‌లో 75వ రాజ్యాంగ ఆమోద దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ధనిక, పేద తేడా లేకుండా స్వేచ్ఛగా ఉంటున్నామంటే అది అంబేడ్కర్ తయారు చేసిన భారత రాజ్యాంగం గొప్పతనమని ప్రతి పౌరుడు తెలుసుకోవాలన్నారు. ప్రపంచ దేశాలలో మన రాజ్యాంగానికి మంచి గుర్తింపు ఉందన్నారు. అంతకుముందు బస్టాండ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

చట్టవ్యతిరేక కార్యక్రమాలు మానుకోవాలి

ప్రస్తుతం రాష్ట్రంలో చట్టానికి లోబడి చేయవలసిన కార్యక్రమాలు కూడా అందుకు వ్యతిరేకంగా జరుగుతున్నాయని, చట్టవ్యతిరేకంగా అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని ముత్యాలనాయుడు విమర్శించారు. అందరికీ ఒకే న్యాయం అందించాలని రాజ్యాంగ స్ఫూర్తికి పోలీసు యంత్రాంగం కట్టుబడి ఉండాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు రమణమ్మ, ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకట రాజారామ్, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీ సభ్యులు కుక్కర మహేశ్వరి, కోఆప్షన్ మెంబరు షేక్ ఉన్నీసా, తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముత్యాలనాయుడు

అధికారులు అప్రమత్తం

- బంగాళాఖాతంలో వాయుగుండం
- జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం
- కలెక్టరేట్ కేంద్రంగా కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

కంట్రోల్ రూమ్ నంబర్లు	
కలెక్టర్ కార్యాలయం	08924-226599
ఆర్డీవో (అనకాపల్లి)	9491998293
ఆర్డీవో (నర్సీపట్నం)	7075356563, 08934-245009

సాక్షి, అనకాపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం వాయుగుండంగా బలపడిన నేపథ్యంలో జిల్లాలో విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం ముందుగా అప్రమత్తమైంది. మండల కేంద్రాల్లో సంబంధిత శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని, అవసరం మేరకు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు సహాయం అందించాలని సూచించారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌తో పాటు డివిజన్ కార్యాలయాల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. వర్షాలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో నిత్యావసర సరకులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారులను డీఆర్వో ఆదేశించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా సన్నద్ధం చేశారు.

వ్యవసాయ అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం

తుమ్మపాల: వాతావరణశాఖ సూచనల మేరకు రానున్న రెండు, మూడు రోజులలో భారీ వర్షాలు పడే అవకాశముందని, జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి వ్యవసాయశాఖ అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరి కోతలు కోసిన రైతులను తమ పంటను వెంటనే ఎత్తయిన ప్రాంతాలను తరలించేలా అప్రమత్తం చేయాలన్నారు. వరి పంట వేసిన రైతుల పూర్తి సమాచారం తక్షణమే సేకరించి అందజేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వర్షాల వల్ల తాగునీరు కలుషితం కాకుండా పంచాయతీ మున్సిపల్ అధికారు లు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయా లని తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులు రిజర్వాయర్లలో నీటిమట్టాలను పరిశీలిస్తుండాలని, నీటిమట్టాలు పెరిగితే వదిలే ముందు దిగువ ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



జి. కొత్తపల్లిలో ఎమ్మెల్యే బండారుకు వినతి పత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

చీడికాడ : 104 సంచార వాహనంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జి. కొత్తపల్లిలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి మంగళవారం 104 ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా 104 ఉద్యోగులు యూనియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి శీరంరెడ్డి భార్గవ్ మాట్లాడుతూ 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని అన్నారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని, 2020 సంవత్సరం తర్వాత విధుల్లో చేరిన డ్రైవరు, డీఈఓకు జి.వో. 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని, అరబిందో యాజమాన్యం వసూలు చేసిన పీఎఫ్ తిరిగి చెల్లించాలని, ఉద్యోగులకు బీమా సదుపాయం కల్పించాలని, ఇతర బకాయిలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

మునగపాకలో రాష్ట్రస్థాయి నిరంతర ఔషధ విజ్ఞాన సదస్సు

మునగపాక: స్థానిక రాహుల్ గాంధీ కల్యాణ మండపంలో ఈ నెల 28, 29 తేదీల్లో రాష్ట్రస్థాయి నిరంతర ఔషధ విజ్ఞాన సదస్సు జరుగుతుందని వైద్యులు ఆలుగోలు ప్రసాదరావు తెలిపారు. పారంపర్య వైద్య మహాసంఘం తిరుపతి, గురూజీ మూలికా వైద్య సమాఖ్య సంయుక్త నిర్వహణలో రెండు రోజులపాటు సదస్సు జరుగుతుందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి 250మందికి పైగా వైద్యులు సదస్సుకు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా సంప్రదాయ వైద్య యోగ రత్నావళి పేరిట పుస్తకం విడుదల చేస్తామన్నారు. రెండు రోజులపాటు జరిగే సదస్సులను విజయవంతం చేయాలని ప్రసాదరావు కోరారు.

కిరండూల్‌కు అదనపు విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం: ఈ సీజన్‌లో అరకు అందాలను వీక్షించే పర్యాటకులు, ప్రయాణికుల సౌకర్యార్థం, వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల జాబితాను క్లియర్ చేసేందుకు కిరండూల్ రైలుకు ఆయా తేదీల్లో అదనపు కోచ్‌ను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 5,7,9,11,13,15,17,19,21,23,25,27,29,31వ తేదీల్లో, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 6,8,10,12,14,16,18, 20,22,24,26,28,30, జనవరి 1వ తేదీల్లో కిరండూల్‌కు ఒక విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు పేర్కొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి చర్యలు

- వారి సమస్యల పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల : చట్టప్రకారం విభిన్న ప్రతిభావంతులకు కల్పించిన హక్కులను వారికి అందజేయాలని కలెక్టర్ విజయ కృష్ణన్ అన్నారు. విభిన్న ప్రతిభావంతుల హక్కుల అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా ప్రభుత్వం సహాయం, సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, వాటిని వారికి సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను శాఖలవారీగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు జి.వి.బి. జగదీష్ మాట్లాడుతూ సంక్షేమ శాఖ ద్వారా మూడువేల మందికి ఉపకరణాలు అందజేసినట్టు తెలిపారు. అందులో 196 బ్యాటరీ వాహనాలు, 600 వినికిడి యంత్రాలు ఉన్నాయని, ఇంకా 35 మందికి ఉపకరణాలు అందజేయవలసి ఉందన్నారు.

ఉపకరణాల పంపిణీకి గ్రామాలలో సర్వే నిర్వహించి లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తున్నదని, అందుకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె. వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు రవికుమార్, అర్జునరావు, శ్రీరాములు మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్లలో తప్పుల సవరణకు చర్యలు తీసుకోవాలని, స్కిల్ డెవలప్‌మెంటు ద్వారా శిక్షణ అందించి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, 70 శాతం వైకల్యం గల వారికి కూడా నూరు శాతం సబ్సిడీతో పాసులు మంజూరు చేయాలని, యూనిక్ ఐడీ కార్డులు పంపిణీ పూర్తి చేయాలని, పదోన్నతుల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ మోహనరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డెరెక్టర్ కె. శచీదేవి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.సరోజిని, డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ పూర్ణిమాదేవి, మహిళా, శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టరు కె.అనంతలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషా రాణి పాల్గొన్నారు.

ప్రజలపై రూ.11 వేల కోట్ల విద్యుత్ భారం



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై సీఐటీయూ నిరసన
- ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా

నర్సీపట్నం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని సీఐటీయూ జి.కోటేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానంటుతున్నాయన్నారు. కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రూపాయలు రాయితీలు ఇస్తూ ప్రజలపై భారం వేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై రూ.11 వేల కోట్ల విద్యుత్ భారాన్ని మోపిందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ని ప్రైవేటీకరణ చేస్తున్నారని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవన్నారు. వీటన్నింటికి నిరసనగా జిల్లా కేంద్రంలో జరుగుతున్న ప్రదర్శనల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ ధర్నాలో సీఐటీయు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సాపిరెడ్డి నారాయణమూర్తి, ఐద్వా జిల్లా ట్రెజరర్ సూర్యప్రభ, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ఆశా జిల్లా నాయకులు వి.సత్యవతి, మిడ్డేమీల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కె.ప్రసన్న, అంగన్‌వాడీ నాయకులు సామ్రాజ్యం, మంగతాయారు పాల్గొన్నారు.

హైస్కూల్ స్థలదాతకు ఘనంగా సత్కారం



ప్రసాదనాయుడును సన్మానిస్తున్న ఎంఈవో-2 జగ్గారావు, పాఠశాల సిబ్బంది

రోలుగుంట : కొమరవోలు జెడ్పీ ఉన్నత పాఠశాల స్థల దాత అయిన గొర్లె ప్రసాదనాయుడును ఆ పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది మంగళవారం ఎంఈవో-2 జగ్గారావుతో కలసి ఘనంగా సన్మానించారు. దివంగత జెడ్పీ చైర్మన్ గొర్లె రామ్మూర్తి నాయుడు అప్పటి సర్పంచ్ గొర్లె చెల్లమ్మనాయుడు, గ్రామ పెద్దల అభ్యర్థన మేరకు జెడ్పీ ఉన్నత పాఠశాలను మంజూరు చేశారు. ఆ సమయంలో పాఠశాలకు కావాల్సిన స్థల అవసరాన్ని గుర్తించిన గొర్లె ప్రసాదనాయుడు తన సోదరులతో కలసి తన తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే గొర్లె కృష్ణంనాయుడు పేరున పాఠశాలకు అవసరమైన బోధనా తరగతి గదులు, ఆటస్థలానికి అనువుగా కావాల్సిన స్థలాన్ని ఇచ్చారు. ఈ నేపథ్యంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది స్థలదాతను మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం సన్మాన గ్రహీత పాఠశాలలో లైబ్రెరీ ఏర్పాటు కోసం రూ. 20 వేలు సిబ్బందికి విరాళంగా అందజేశారు. ప్రసాదనాయుడు పెద బొడ్డేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ ఇటీవలే ఉద్యోగ విరమణ చేశారు.

టౌన్ ప్లానింగ్ సెక్రటరీ సస్పెన్షన్

మరో ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు

డాబాగార్డెన్స్: విధుల్లో నిర్లక్ష్యం వహించిన జీవీఎంసీ జోన్-8 టౌన్‌ప్లానింగ్ విభాగంలో వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీ సుబ్బలక్ష్మిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదే జోన్‌లో పర్యవేక్షణలో నిర్లక్ష్య ధోరణిని కనబరిచిన అప్పటి టీపీవో తేజేశ్వరరావు, ఏసీపీ రఘునాధరావుకు షోకాజ్ నోటీస్‌ను జారీ చేసినట్లు పేర్కొన్నారు. జోన్-8 పరిధి 97వ వార్డు సుజాతనగర్‌లో ఓ ఇంటి యజమాని తన నివాస భవనానికి స్టిల్ట్ ఫ్లోర్ పార్కింగ్‌కు ఉపయోగించుటకు, గ్రౌండ్ ఫ్లోరు, ఆపై రెండు అంతస్తులు నిర్మించేందుకు జీవీఎంసీ అనుమతులు ఇచ్చిందన్నారు. ఆ ఇంటి యజమాని అనుమతులు లేకుండా అదనంగా 3 అంతస్తులు నిర్మించారు. దీనిపై సంబంధిత వార్డు ప్లానింగ్ సెక్రటరీ తగిన వివరణ ఇవ్వకపోవడంతో పాటు విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు గాను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు. అదే జోన్‌లో గతంలో విధులు నిర్వహించిన టౌన్ ప్లానింగ్ అధికారి డి.తేజేశ్వరరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఇన్‌చార్జి సీహెచ్.రఘునాథరావు విధుల పట్ల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు గాను షోకాజ్ నోటీసులు జారీ చేసి, నిర్ణీత గడువులోపల తగిన వివరణ ఇవ్వాలని ఆదేశించామన్నారు.

నేవీ మారథాన్ ఏర్పాట్ల పరిశీలన

డాబాగార్డెన్స్: నగరంలో డిసెంబర్ 15న నిర్వహించనున్న 'వైజాగ్ నేవీ మారథాన్' ఏర్పాట్లను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. బీచ్ రోడ్డులో 42 కిలోమీటర్ల మేర (ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు) నేవీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మారథాన్ ఏర్పాట్లు, వివరాలను కెప్టెన్, రేస్ డైరెక్టర్ టీఆర్ఎస్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. మారథాన్‌లో అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనున్నందున జీవీఎంసీ తరఫున కావల్సిన అనుమతులు మంజూరు చేస్తూ, అవసరమైన ఏర్పాట్లు చేయాలని ప్రధాన ఇంజనీర్ శివప్రసాదరాజు, సీసీపీ ప్రభాకరరావు, జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను ఆదేశించారు. జీవీఎంసీ తరఫున అధికారులు, ఉద్యోగులు, వార్డు కార్యదర్శులు పాల్గొనేలా చర్యలు చేపట్టాలని అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణను ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ పర్యవేక్షక ఇంజనీర్ శ్యాంసన్ రాజు, డీసీపీ హరిదాసు, ఏసీపీ సీహెచ్ మధుసూదనరావు, కార్యనిర్వాహక ఇంజనీర్ గంగాధర్ పాల్గొన్నారు.

సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



సాయుధ దళాల పతాక దినోత్సవంపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

తుమ్మపాల: సాయుధ దళాల పతాక దినోత్సవం డిసెంబర్ 7 పురస్కరించుకుని పతాక దినోత్సవ స్టిక్కర్లు, కారు ఫ్లాగ్స్ పోస్టర్స్‌ను కలెక్టర్ విజయ కృష్ణన్ మంగళవారం ఆవిష్కరించారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం కలెక్టరేట్‌లో ఆమెను కలిసి సాయుధ దళాల పతాక దినోత్సవంపై వివరించారు. స్టిక్కర్ల విక్రయాల ద్వారా వచ్చిన సొమ్మును యుద్ధంలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలకు సంక్షేమం కొరకు వినియోగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సహాయకులు శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

కేజీబీవీ సెక్రటరీకి పీఆర్‌టీయూ వినతి



కేజీబీవీ సెక్రటరీ దేవానందరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్

నర్సీపట్నం: కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ మినిమం టైం స్కేల్ ఇవ్వాలని కోరుతూ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు డి.గోపీనాథ్ కేజీబీవీ సెక్రటరీ డి.దేవానందరెడ్డిని అమరావతిలో కలిసి వినతిపత్రం అందజేశారు. కేజీబీవీ టీచర్లతో సమానంగా పనిచేస్తున్న కంప్యూటర్ అసిస్టెంట్లకు జీతాలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. కేజీబీవీలో వార్డెన్లను నియమించాలని, సమ్మె కాలం జీత భత్యాలను చెల్లించాలని కోరినట్లు తెలియజేశారు.

అడవిపంది దాడిలో గొర్రెల కాపరి మృతి



నాగేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలిస్తున్న కుమారుడు దుర్గాప్రసాద్



సంఘటన స్థలంలో ఆనవాళ్లు పరిశీలిస్తున్న అటవీ అధికారులు

నాతవరం : గొర్రెల కాపరిని అడవి పంది దాడి చేసి చంపేసిన సంఘటన గ్రామస్తుల్లో భయాందోళన కలిగించింది. నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజు నాతవరం ఫారెస్టు సెక్షన్ అధికారి చిరంజీవి అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలో శృంగవరం గ్రామానికి చెందిన సీలి నాగేశ్వరరావు (62) ఎప్పటిమాదిరిగానే తమ గొర్రెలను మేత కోసం మంగళవారం అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. సమీపంలో వరి పంట పొలాలు కూడా ఉన్నాయి. గొర్రెల మేత మేస్తుండగా అందులో ఒక గొర్రెను అడవి పంది గాయపరిచి పట్టుకుపోతుండగా గొర్రె అరవడంతో గమనించిన నాగేశ్వరరావు అడవి పంది వెంట పరిగెత్తుకుంటూ వెళ్లి కర్రతో కొట్టాడు. అడవి పంది గొర్రెను వదిలి నాగేశ్వరరావుపై దాడి చేసింది. వరి చేనులో దొర్లించి గాయపరించి చంపేసింది. ఆ సంఘటన చుట్టు పక్కల ఉన్న రైతులు గమనించి గ్రామంలో కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చారు. కుమారుడు దుర్గా ప్రసాద్ వచ్చి తన తండ్రి వరి చేనులో తీవ్ర గాయాలతో మరణించి పడి ఉండడాన్ని చూసి బోరున విలపించాడు. అటవీ శాఖ అధికారులు వచ్చి అడవి పంది సంచరించిన ప్రాంతాలను పరిశీలించారు. మృతుడు నాగేశ్వరరావుకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై నాతవరం ఎస్ఐ సిహెచ్.భీమరాజు సంఘటన స్థలంలో మృతదేహన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'పాట'కుల శేఖరుడు



- సినీ గేయరచయిత కులశేఖర్ మృతి
- సింహాచలం జన్మస్థలం
- విలేకరిగా జీవిత ప్రస్థానం
- సిరివెన్నెల సీతారామశాస్త్రి శిష్యుడిగా గుర్తింపు
- ఎన్నో పాటలకు సాహిత్యం అందించిన గేయరచయిత

సింహాచలం: గాజువాక పిల్లా...మేము గాజులోల్లం కాదా.... అంటూ తన సాహిత్యంతో సినీ ప్రేక్షకులను ఉర్రూతలూగించిన గేయరచయిత కులశేఖర్ (53) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం హైదరాబాద్‌లో మృతిచెందారు. విశాఖలోని సింహాచలంలో జన్మించిన ఆయన అనతికాలంలోనే తెలుగు సినీ పరిశ్రమలో గేయ రచయితగా ఎంతో మంచి పేరు తెచ్చుకున్నారు. నగరంలోని ఒక కళాశాలలో డిగ్రీ , ఏయూలో ఎంఏ సంస్కృతం చదివిన కులశేఖర్ తొలినాళ్లలో విశాఖలోనే ఒక దినపత్రికలో విలేఖరిగా పనిచేశారు. ఆ తర్వాత ఓ చానల్‌లో ఉద్యోగంలో చేశారు. ఆదినుంచీ తెలుగు భాష, సాహిత్యంపైన పట్టు ఉన్న కులశేఖర్‌కు సినీ గేయరచయిత అవ్వాలన్న కోరిక ఉండేది. ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రితో పరిచయం ఉండటంతో ఆయనవద్ద శిష్యుడిగా చేరారు. 2000 సంవత్సరంలో వచ్చిన చిత్రం సినిమా ద్వారా గేయరచయితగా సినీ రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత అనతికాలంలో ఎంతో ఎత్తుకు ఎదిగారు. అప్పటి యువత హృదయాలని హత్తుకునే ఎన్నో పాటలను కులశేఖర్ అందించారు. నువ్వునేను, జయం, సంతోషం, ఇంద్ర, నిజం, వసంతం, ఘర్షణ, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే.. తదితర చిత్రాలకు పాటలు రాశారు. వెంకటేష్ నటించిన ఘర్షణ చిత్రానికి మాటలు కూడా కులశేఖరే సమకూర్చారు.

సింహాచలం స్థానాచార్యులు రాజగోపాల్‌కు సోదరుడు

కులశేఖర్ తండ్రి పేరు టి.పి.శ్రీరామచంద్రాచార్యులు, తల్లి రంగనాయకమ్మ. వీరికి తొమ్మిదిమంది సంతానం.. కాగా కులశేఖర్ ఆఖరివాడు. శ్రీ రామచంద్రాచార్యులు నగరంలోని ఏవీఎన్ కళాశాలలో తెలుగు విభాగాధిపతిగా పనిచేసి 2012లో పరమపదించారు. కులశేఖర్‌కి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సింహాచలం దేవస్థానంలో ప్రస్తుతం స్థానాచార్యులుగా విధులు నిర్వర్తిస్తున్న టి.పి.రాజగోపాల్ కులశేఖర్ సోదరుడే. కులశేఖర్ మృతిచెందాడన్న వార్త సింహాచలం గ్రామస్తులను కలచివేసింది. సామాజిక మాధ్యమాల్లో కులశేఖర్ మృతిచెందారన్న వార్తలను చూసి అయ్యో పాపం అంటూ ఆయన అందించిన పాటలను పలువురు గుర్తుచేసుకున్నారు.

కలుషిత ఆహారంతో ఐదుగురికి అస్వస్థత



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మి



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అడపా లోవ

ఎస్.రాయవరం : పి.ధర్మవరం గ్రామంలో ఓ కుటుంబంలో ఫుడ్ పాయిజన్ జరిగి ఐదుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బాధిత కుటుంబ సభ్యులు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో సోమవారం బోనాలు పండగ సందర్భంగా అడపా లోవ ఇంటికి అల్లుడు చిరంజీవి, కుమార్తె లక్ష్మి, వారి పిల్లలు లిఖిత,పల్లవి యలమంచిలి మండలం పులపర్తి నుంచి పి.ధర్మవరం వచ్చారు. సోమవారం రాత్రి ఇంటి వద్ద వరి నూక ఉప్మా వండుకుని తిన్నారు. తిన్న కాసేపటికి ఆయాసం, వాంతులతో ఇబ్బంది పడ్డారు. వారిని వెంటనే అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. పిల్లలు ఆరేళ్ల లిఖిత, పల్లవి, తండ్రి చిరంజీవి ఆరోగ్యం కాస్త నిలకడగా ఉంది. అడపా లోవ ఆమె కుమార్తె శానాపతి లక్ష్మి అపస్మారక స్థితికి చేరుకోవడంతో వారిని విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రమేష్‌బాబు బాధితుల ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం: రాయగడ-విజయనగరం సెక్షన్, కోమటిపల్లి స్టేషన్ పరిధిలో ఆధునికీకణ పనుల నేపథ్యంలో ఆయా తేదీల్లో పలు రైళ్లు రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-కోరాపుట్(18512) బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 29, డిసెంబరు 2వ తేదీల్లో, కోరాపుట్-విశాఖపట్నం (18511)బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 30, డిసెంబరు 3వ తేదీల్లో, విశాఖపట్నం -కోరాపుట్(08546) పాసింజర్ స్పెషల్ ఈ నెల 29, డిసెంబరు 4వ తేదీల్లో, కోరాపుట్-విశాఖపట్నం(08545) పాసింజర్ స్పెషల్ ఈనెల 29, డిసెంబరు 5వ తేదీల్లో రద్దు చేశారు.

గమ్యం కుదించిన రైళ్లు: ఈ నెల 28 నుంచి డిసెంబరు 3వ తేదీ వరకు గుంటూరు-రాయగడ(17243) ఎక్స్‌ప్రెస్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. రాయగడ-గుంటూరు (172 44) ఎక్స్‌ప్రెస్ డిసెంబరు 4వ తేదీ వరకు విజయనగరం నుంచి బయల్దేరుతుంది.

కిరండూల్‌కు అదనపు విస్టాడోమ్ కోచ్: ఈ సీజన్‌లో అరకు అందాలను వీక్షించే పర్యాటకులు, ప్రయాణికుల సౌకర్యార్థం, వెయిటింగ్ లిస్ట్ ప్రయాణికుల జాబితాను క్లియర్ చేసేందుకు కిరండూల్ రైలుకు ఆయా తేదీల్లో అదనపు కోచ్‌ను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 5,7,9,11, 13,15,17,19,21,23,25, 27,29,31వ తేదీల్లో, తిరుగు ప్రయాణంలో కిరండూల్-విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్‌కు డిసెంబరు 6,8,10,12,14,16, 18,20,22, 24,26,28,30, జనవరి 1వ తేదీల్లో కిరండూల్‌కు ఒక విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జతచేస్తున్నట్లు పేర్కొన్నారు.

కేంద్ర మంత్రితో అక్షయ ఇన్ఫోటెక్ ప్రతినిధుల భేటీ



మంత్రితో అక్షయ ఇన్ఫోటెక్ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో అక్షయ ఇన్ఫోటెక్ ప్రతినిధులు మంగళవారం భేటీ అయ్యారు. నగరానికి వచ్చిన మంత్రికి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు సంబంధించి తమ సంస్థ అందిస్తున్న అత్యాధునిక సాంకేతిక పద్ధతులను వివరించారు. తమ సంస్థ చేపట్టిన సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టంను గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంలో అమలు చేసేందుకు మంత్రి చంద్రశేఖర్ ఆసక్తి చూపారని అక్షయ ఇన్ఫోటెక్ మేనేజింగ్ పార్టనర్ డాక్టర్ రేణు శరత్ బాబు తెలిపారు. ఇళ్లల్లో ఉత్పత్తయ్యే ఘన వ్యర్థాలను వేరు చేసి వీటిలో ఆహార వ్యర్థాలు, కూరగాయలు పండ్ల తొక్కలతో 30-40 శాతం సేంద్రియ ఎరువులుగా మారుస్తున్నామని, మిగిలిన వ్యర్థాలతో ఇటుకలు తయారీ, ఇంధనం ఉత్పత్తికి వినియోగిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సంస్థ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎస్.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

7న మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం

మహారాణిపేట (విశాఖ): పిల్లల బంగారు భవిష్యత్తు కోసం - బడి వైపు ఒక అడుగు అనే నినాదంతో నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్స్ సమావేశాలు విజయవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పిలుపునిచ్చారు. డిసెంబర్ 7న జరిగే మెగా పేరెంట్ టీచర్స్ సమావేశంపై జిల్లా విద్యాశాఖ అధికారులతో శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో 11 మండలాల పరిధిలోని ఉన్న 595 ప్రభుత్వ పాఠశాల్లో పీటీఎం సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమం నిర్వహణ ద్వారా పాఠశాలలు, తల్లిదండ్రుల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి అవకాశం ఉందని తెలిపారు. పోషకాహారం, పిల్లల భద్రత అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తామన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సహకారంతో సైబర్ నేరాలకు చెక్





సైబర్ నేరాలపై బ్యాంక్ ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

అనకాపల్లి: సైబర్ నేరాలను జరిగినప్పుడు బ్యాంక్ ఖాతాదారులు, ఉద్యోగులు గంటలోపు దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చినట్లయితే నగదును తిరిగి తీసుకురావచ్చని డీఎస్పీ ఎం.శ్రావణి అన్నారు. స్థానిక విజయ రెసిడెన్సీలో మంగళవారం రాత్రి పట్టణ పరిధిలో వివిధ బ్యాంక్ మేనేజర్లతో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెద్ద మొత్తంలో సొమ్ము విత్‌డ్రా చేసే ఖాతాదారులు సైబర్ నేర బాధితులేమోనని బ్యాంకు ఉద్యోగులు ఆరా తీయాలన్నారు. డిజిటల్ అరెస్టులు, సైబర్ నేరాల గురించి భయపడవద్దని, ఏ పోలీస్ అధికారి ఫోన్‌లో అరెస్టులు చేయరని వారికి వివరించి, ధైర్యం చెప్పాలన్నారు. అటువంటి సంఘటనలు ఎదురైనప్పుడు 1930 నంబర్‌కు ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చన్నారు. బ్యాంకు ఉద్యోగుల సహకారం ఉంటే సైబర్ నేరాలకు సులభంగా చెక్ పెట్టవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టి.వి.విజయకుమార్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

షిప్‌యార్డ్‌లో తోషిబా బ్యాటరీ ప్రతినిధులు



తోషిబా ప్రతినిధి బృందంతో చర్చలు జరుపుతున్న హెచ్ఎస్ఎల్ సిబ్బంది

సింధియా: సముద్ర రంగం కోసం అధునాతన ఇంధన నిల్వల పరిష్కారాలను అన్వేషించేందుకు జపాన్‌కు చెందిన తోషిబా బ్యాటరీ విభాగ బృందం మంగళవారం హిందూస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను సందర్శించింది. తోషిబా బ్యాటరీ సేల్స్ అండ్ బిజినెస్ హెడ్ సతో గోరో-సాన్, ఇండియా డైరెక్టర్ కజుటకా నిషిమూరా-సాన్, ఇండియా సేల్స్ ఇన్‌చార్జ్ రాకేష్ ట్రక్రూ నేతృత్వంలోని బృందం ఎల్ డబ్ల్యూటీ గ్రూప్‌నకు చెందిన సింగ్ మణిందర్‌తో కలిసి షిప్‌యార్డ్‌లో పర్యటించారు. హెచ్ఎస్ఎల్ సీఎండీ గిర్దీప్ సింగ్ మెరైన్ బ్యాటరీ విషయాలను సమగ్రంగా వివరించారు. తోషిబా నుంచి అత్యాధునిక లిథియం టైటానియం ఆక్సైడ్ బ్యాటరీ సాంకేతికతపై చర్చించారు.

క్లుప్తంగా

సైబర్ మోసాలతో అప్రమత్తం



సైబర్ మోసాలపై అవగాహన కలిగిస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట: సైబర్ మోసాలకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఐ అల్లు స్వామినాయుడు కోరారు. మండలంలోని బయ్యవరంలో మంగళవారం రాత్రి ప్రజలతో సమావేశం నిర్వహించి సైబర్ నేరాలపై అవగాహన కలిగించారు. రుణాలు ఇస్తామని, ఆటల పేరుతోను ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఇటువంటి వాటిని విశ్వసించకుండా జాగురూకతతో ప్రజలు వ్యవహరించాలన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగితే 1930 నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎస్ఐ మనోజ్ పాల్గొన్నారు.

మహిళలకూ అవగాహన ఉండాలి..

అనకాపల్లి: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని రూరల్ సీఐ అశోక్‌కుమార్ అన్నారు. మండలంలో కేఎస్ఆర్‌పేట మహిళా సమాఖ్య భవనంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా డిసెంబర్ 23 వరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు మేరకు గ్రామాల్లో మహిళలకు సంబంధించిన చట్టాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన మాట్లాడారు. చట్టాలపై అవగాహన ఉంటే నేరాలను నియంత్రించవచ్చన్నారు. సైబర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసినట్లయితే సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. వెలుగు డీఆర్‌డీఏ ఏరియా కో ఆర్డీనేటర్ ధర్మారావు, ఏపీఎం కొండమ్మ, పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు



బాటిళ్లతో పట్టుబడిన నాయుడు

తుమ్మపాల: ఎక్సైజ్, ప్రొహిబిషన్ సీఐ లక్ష్మునాయుడు అందించిన వివరాల ప్రకారం మండలంలో రేబాక గ్రామం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో అక్రమ మద్యం విక్రయాలు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు జరిగాయి. ఇన్‌స్పెక్టర్ వై.ఎల్.నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది మాటు వేసి మద్యం తరలిస్తున్న జీఎం నాయుడు అనే వ్యక్తిని పట్టుకున్నారు. అప్పుడు అతని వద్ద 50 మద్యం బాటిళ్లు ఉన్నాయి. దీంతో వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. అతన్ని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 2,916 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,400	3,970
మొదటి రకం	3,190	3,900
రెండో రకం	2,950	3,380
మూడోరకం	2,770	3,000

అనకాపల్లి సినిమాలు

జీబ్రా	: రాజా
మందిర	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
కంగువ	: పర్తిసాయి
మెకానిక్ రాకీ	: షిర్డిసాయి
లక్కీ భాస్కర్	: వెంకటేశ్వర
సినిమా పిచ్చోడు	: శ్రీసత్య
దేవకీనందన వాసుదేవ	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 33 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-11 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ య.లోకేష్‌ను (9703619706) నంబరులో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 383 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 325 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 సంప్రదించవచ్చు.

మసిబారుతున్న పల్లెలు



శంకరం వద్ద సర్వీస్ రోడ్డుపై తరచూ నిలిచిపోతున్న ట్రాఫిక్

- క్వారీలు, క్రషర్ల వల్ల అందం.. అస్తిత్వం ఆవిరి
- భారీ లోడ్లతో దుమ్మూ, ధూళి వెదజల్లుతున్న క్వారీ లారీలు

పచ్చని పంటలతో కళ్లకు ఆహ్లాదంగా కనిపించే పల్లెలు కాలుష్యం కోరల్లో చిక్కుకుంటున్నాయి. **వివరీతమైన దుమ్ము, ధూళితో కొట్టుమిట్టా**డుతున్నాయి. క్వారీలు, **క్రషర్ల వల్ల నిరంతరం కాలుష్యం వెలువడి అందం, అ**స్తిత్వం కోల్పోతున్నాయి. పల్లె ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అలాగే భారీ బండరాళ్లను తరలించే లారీలు పల్లెల మీదుగా ప్రయాణిస్తూ స్వచ్ఛమైన ఈ ప్రాంతాలను కాలుష్య కాసారంగా మార్చేస్తున్నాయి. దీంతో స్థానికులు రోగాలతో ఇబ్బంది పడుతున్నారు.

తుమ్మపాల: మండలంలో క్వారీలు, క్రషర్లు ఉన్న సంగతి అందరికీ తెలిసిందే. ఒకప్పుడు కేవలం క్వారీలున్న గ్రామాలు మాత్రమే కాలుష్యం బారిన పడి కిడ్నీ సంబంధిత వ్యాధులతో ప్రజలు బాధపడేవారు. ఇప్పుడు మండల వ్యాప్తంగా విస్తరించింది. ప్రతి గ్రామంలోను ప్రజలు కిడ్నీ వ్యాధులతో ఆస్పత్రుల పాలవుతున్నారు. క్రషింగ్ ద్వారా వచ్చిన ధూళి వల్ల ప్రజలు రోగాల బారిన పడుతుంటే వాటికి తోడు భారీ బండరాళ్లతో రాకపోకలు సాగించే లారీల నుండి వెలువడే కాలుష్యం మరో కారణమవుతోంది.

కేజీఎఫ్ తరహాలో బండరాళ్ల తరలింపు..

రాంబిల్లి మండలంలో జరుగుతున్న అతి పెద్ద ప్రాజెక్టు నిర్మాణానికి వేల సంఖ్యలో వాహనాల్లో బండరాళ్లను తరలించుకుపోతున్నారు. దీంతో రోడ్లు శిథిలమైపోతున్నాయి. ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలో మార్టూరు మీదుగా గుంకల్లోవ, అనకాపల్లి - చోడవరం రోడ్డు మీదుగా తుమ్మపాల నుంచి బొజ్జన్నకొండకు.. అక్కడి నుంచి శంకరం మీదుగా అనకాపల్లి - ఆనందపురం జాతీయ రహదారికి చేరుకుని రేబాక అండర్ బ్రిడ్జి నుంచి శంకరం ఎస్సీ కాలనీ జంక్షన్ మీదుగా జాతీయ రహదారి మీదుగా కావలసిన చోటుకు చేరుకుంటున్నాయి. ఇలా ప్రయణించే వాహనాల క్రమాన్ని చూస్తే కేజీఎఫ్ సినిమాలో ట్రక్కులు గుర్తుకు రాకమానదు.

గ్రామస్తుల తిరుగుబాటుతో లొంగిన క్వారీ మాఫియా.. మండలంలో అక్రమ ఖనిజ తరలింపునకు అనువైన మార్గంగా ఉన్న చింతనిప్పుల అగ్రహారం రోడ్డును గ్రామస్తులు అడ్డుకోవడంతో అక్రమ క్వారీ మాఫియాకు అడ్డుకట్ట వేసినట్లయింది. గ్రామస్తులంతా ఏకతాటిపై నిలిచి బండరాళ్ల లారీలను గ్రామంలో నుంచి ప్రయణించకుండా అడ్డుకోగలిగారు. మొదట్లో పోలీసులతో గ్రామస్తులను భయపెట్టినా గ్రామస్తులు ముక్తకంఠంతో తిరుగుబాటు చేయడంతో పోలీసులు వెనక్కి తగ్గారు.

భారీ లోడ్లతో ట్రక్కుల రాకపోకలు నిలిచిపోయాయి. కాని ప్రత్యామ్నయంగా బొజ్జన్నకొండ రోడ్డును వినియోగించుకుని బండరాళ్ల అనధికార రవాణా చేస్తున్నారు.



బొజ్జన్నకొండలో రోడ్డుపై భారీ లారీలు

పల్లెల మీదుగా నిరంతర ప్రయాణం..

మండలంలో మామిడిపాలెం, మాకవరం, మార్టూరు, ఊడేరు, బవులువాడ గ్రామాల్లో అక్రమ క్వారీలు విపరీతంగా పెరిగిపోయాయి. అనుమతులు ఉన్నవి పదుల్లో ఉంటే అనధికారకంగా నిర్వహించేవి వందల్లో ఉంటున్నాయి. కూటమి ప్రభుత్వంలో అనుమతులతో పని లేకుండా కొండలను పిండి చేస్తున్నారు. రసాయనాలతో భారీ బ్లాస్టింగ్‌లు చేసి బండరాళ్లను పల్లెల మీదుగా తరలించేస్తున్నారు. ఆయా గ్రామాల్లో క్వారీల ద్వారా దోచేసిన బండరాళ్లను రాంబిల్లి మండలంలో చేడుతున్న భారీ ప్రాజెక్టులకు లారీలపై రాత్రింబవళ్లు తోలుకుపోతున్నారు. క్వారీలు ఉన్న గ్రామాల ప్రజలు గగ్గోలు పెడుతున్నా సరే పట్టించుకోకుండా తరలించుకుపోతు పల్లెలను కాలుష్యమయం చేసేస్తున్నారు.



రేబాక అండర్ బ్రిడ్జి వద్ద నిలిచిపోయిన క్వారీ లారీ

దేశవ్యాప్త ఉద్యమాలకు రైతులు సిద్ధం కావాలి

అనకాపల్లి: కేంద్రంలో బీజేపీ పాలనకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతులు ఉద్యమాలకు సిద్ధం కావాలని, డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ కమిషన్ సిఫారసు చేసిన విధంగా సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం కలిపి చట్టబద్ధ ఎంఎస్‌పీలను ప్రకటించాలని రైతు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర కన్వీనర్ ఎం.సూర్యనారాయణ అన్నారు. కేంద్ర కార్మిక సంఘం పిలుపు మేరకు స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకూ మంగళవారం ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టారు. అంతకు ముందు నెహ్రూ చౌక్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అనుసరిస్తున్న కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన చెప్పారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రకృతి వైపరీత్యాలు, చీడ-పీడలు, ధరల పతనం, రుణభారం వంటి వాటి వల్ల లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన నేపథ్యంలో ఒక్క పర్యాయం కూడా పంట రుణాల బకాయిలను మాఫీ చేయలేదని అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆలోచన విరమించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తక్షణం ఉపసంహరించుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శంకరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

కె.లోకనాథం మాట్లాడుతూ రైతులు, పేదల పాలిట ఉరి తాడు కాగల ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరించుకోవాలని, గృహ వినియోగదారులకు, చిన్న వ్యాపారులకు, వ్యవసాయ మోటర్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు తక్షణమే తొలగించాలన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, భవన నిర్మాణ, హమాలీ, ఆటో, రవాణా రంగం తదితర అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సామాజిక సంక్షేమం పథకాలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు కార్మిక సంఘాల జిలా నాయకులు వై.ఎన్.భద్రం, ఆర్.దొరబాబు, అప్పలరాజు, కర్రి అప్పారావు, కె.మోహన్‌రావు, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యనారాయణ, వరలక్ష్మి, డి.వెంకన్న, వి.వి.శ్రీనివాసరావు, గండి నాయనబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల కల్యాణం

అనకాపల్లి: స్థానిక గవరపాలెం పీలావారి గౌరీపరమేశ్వరుల మహోత్సవంలో భాగంగా సోమవారం రాత్రి గౌరీపరమేశ్వరుల కల్యాణాన్ని బొడ్డేడ సత్యదేవ్, భీమరశెట్టి శ్రీనివాసరావు, భీమరశెట్టి లక్ష్మీనారాయణ దంపతులచే ఆలయ అర్చకులు నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు కొణతాల రఘునాథ్, శాశ్వత చైర్మన్ భీమరశెట్టి వరహాలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గౌరీ వెల్ఫేర్ కూరగాయల మార్కెట్ వద్ద..

స్థానిక గౌరీ హోల్‌సేల్ కూరగాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామి ఆలయం వద్ద స్వామివారికి సోమవారం రాత్రి శివలింగానికి పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ క్షీరాభిషేకం చేపట్టారు. అనంతరం ఓంకారం, శివలింగం, త్రిశూలం అలంకరణలో కోటి దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో కూరగాయల సంఘం అధ్యక్షుడు మళ్ల జగప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



గౌరీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శివునికి ప్రత్యేక పూజలు

కశింకోట: స్థానికంగా ఉన్న పలు దేవాలయాల్లో కార్తీక మాసం మలి ఏకాదశి పూజలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శివాలయంలో శివలింగానికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. పంచామృతాలు, పండ్ల రసాలతో అర్చించారు. ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. జిల్లేడు పూలతో అందంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు వి. చిదంబరం, వి. కృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పాఠశాలల వేళల పెంపుతో విద్యార్థులపై ఒత్తిడి

కె.కోటపాడు : రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో పెంచిన పని వేళల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి అడిగర్ల సత్యంనాయుడు, మండల కార్యదర్శి పోతల నాయుడు అన్నారు. మండలంలో పలు పాఠశాలలు, కింతాడలో గల కస్తూర్బా పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసిన వీరు పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సత్యంనాయుడు, పోతల నాయుడు మాట్లాడుతూ చుట్టుపక్కల రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్‌లో పెంచిన పనివేళల సమయాలు ఎక్కడా అమలు కాలేదన్నారు. పని వేళల పెంపుతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతుందన్నారు. కొఠారి కమిషన్ సూచన మేరకు పాత పని వేళలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలతో పాటు పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించి మెరుగైన ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి ఇమంది ప్రవీణ్, రమేష్, ఉమ, చంద్రకళ, దేముడమ్మ, శిరీష పాల్గొన్నారు.

నల్లమారమ్మ తల్లి జాతరకు ప్రత్యేక బస్‌లు

అనకాపల్లి: నర్సీపటం మండలం జి.కోడూరు గ్రామంలో శ్రీ నల్లమారమ్మ తల్లి జాతరను పురస్కరించుకుని అనకాపల్లి డిపో నుంచి జి.కోడూరు గ్రామానికి బుధ, గురు, శుక్ర, శనివారాలు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్‌లు నడపనున్నట్లు అనకాపలి డిపో ట్రాఫిక్ మేనేజర్ రవిచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లమారమ్మతల్లి జాతరకు ప్రతి రోజు అనకాపల్లి డిపో నుంచి ఉదయం 10.30, మధ్యాహ్నం 2.30, సాయంత్రం 6.15కు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు.

ఉక్కు పరిరక్షణకు డిసెంబర్ 1న మహాధర్నా

అనకాపల్లి: విశాఖ ఉక్కు పరిరక్షణకు డిసెంబర్ 1న కూర్మనపాలెం జంక్షన్ వద్ద బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు తెలిపారు. స్థానిక కొడుగంటి గోవిందరావు భవనంలో మంగళవారం ప్రజా సంఘాల నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడాలని, నక్కపల్లిలో కొత్తగా స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం మంచిదే కానీ, ఉన్న స్టీల్‌ప్లాంట్‌ను కూడా కాపాడుకుంటే మంచిది అన్నారు. ప్రజాసంఘాల నేతలు విల్లూరి పైడారావు, కొణతాల హరనాథ్‌బాబు, కోరుబిల్లి శంకరరావు, బుగడ అప్పారావు, బొట్టా చిన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం

అనకాపల్లి: అక్కిరెడ్డిపాలెం పంచాయతీ శ్రీరంశెట్టివానిపాలెం గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీ ఉమా సమేత పంచముఖేశ్వర నంది దేవాలయంలో పార్వతీ పరమేశ్వరుల 25వ వార్షికోత్సవ కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణాన్ని పరవాడ మండలం పెదముషిడివాడ గ్రామానికి చెందిన ముగుండా కిరణ్‌చండ్ లీలా పుణ్యవతి, నీలికొండ ప్రతాప్ అలేఖ్య దంపతులచే ఆలయ అర్చకులు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 10 వేల మందికి ముగుండా కిరణ్‌చండ్ లీలాపుణ్యవతుల దంపతులచే భారీ అన్నసమారాధన నిర్వహించారు. రాత్రి ఆలయం వద్ద జ్యోతిర్లింగార్చన వంటి కార్యక్రమాలను ఆలయ అర్చకులు సంతోష్‌శర్మ చేపట్టారు.

వాస్కా ప్రాజెక్టుకు మూడు గ్రామాల ఎంపిక

తుమ్మపాల: గ్రామీణ ప్రాంతాల్లో నీటి భద్రత, వాతవరణ అనుసరణ (వాస్కా) బలోపేతానికి తగు చర్యలు తీసుకుంటున్నామని వాస్కా ప్రాజెక్టుల సాంకేతిక నిపుణులు అమర్ షేక్ సేనా తెలిపారు. పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వాస్కా ప్రాజెక్టు అమలుకు జిల్లాలో మూడు మండలాలను ఎంపిక చేయడమైందని, ఒక్కొక్క మండలంలో ఒక్కొక్క పంచాయతీ ఎంపిక జరిగిందన్నారు. అనకాపల్లి మండలంలో కొండుపాలెం, రావికమతం మండలంలో మర్రివలస, రాంబిల్లి మండలంలో లాలంకోడూరు వీటిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎం.రోజారాణి ఎంపీడీవో నరసింహారావు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాలి

అనకాపల్లి: పట్టణ పరిధిలో ద్విచక్ర వాహన చోదకులకు పార్కింగ్ ప్రదేశం ఏర్పాటు చేయాలని, షాపింగ్ మాల్స్, దుకాణాల వద్ద పార్కింగ్ షెల్టర్లు ఏర్పాటు చేసేలా షాపుల యజమానులతో సమావేశాలు నిర్వహించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నయాదవ్ అన్నారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటరమణతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో మెయిన్‌రోడ్డు 25 శాతం మాత్రమే పార్కింగ్ పెట్టుకోవడానికి అవకాశం ఉందని, మిగిలిన 75 శాతం ద్విచక్ర వాహన చోదకులు రహదారులపై పార్కింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. మెయిన్ రోడ్డులో భారీ వాహనాల లోడింగ్, అన్‌లోడింగ్ వేళలు నిర్ణయించాలని, రహదారులపై పార్కింగ్ చేసే వాహనాలపై కేసులు రాయడం వల్ల వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నట్లు ఆయన చెప్పారు. ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటరమణ మాట్లాడుతూ పట్టణ పరిధిలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు చేపడుతున్నామని, రహదారులపై వాహనాలు విచ్చలవిడిగా పార్కింగ్ చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రానున్న క్రిస్మస్, సంక్రాంతి, వివిధ పండగలను పురస్కరించుకుని ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు విల్లూరి పైడారావు, బొడ్డేడ అప్పారావు, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, సూదికొండ మాణిక్యాలరావు, బొడ్డు సోమరాజు, బొబ్బిలి గోవిందరాజు, సత్యసాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సీఐ వెంకట నారాయణతో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

వరి రైతులు జాగ్రత్తలు పాటించాలి

అనకాపల్లి: తుపాను ప్రభావం ఉన్నందున రైతులు వరి కోతలు నిర్వహిస్తే పనలు మీద ఉన్న వరిని కుప్పలు వేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి పి.రంగాచారి అన్నారు. మార్టూరు, కొండుపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వరి కోతలు ప్రారంభించని రైతులు కోతలను మూడు రోజుల పాటు వాయిదా వేసుకోవాలన్నారు. వరి తర్వాత రెండో పంటగా వేసుకోవడానికి మినుములు, పెసల విత్తనాలు రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్ఏఆర్ఎస్ కేంద్రంలో కేజీ రూ. 100కి అమ్మకాలు సాగుతున్నాయన్నారు. వరి కోసే ముందే అపరాలని ఎకరానికి 12 కేజీల చొప్పున విత్తుకోవలసిందిగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త రమణమూర్తి, వ్యవసాయ సహాయకులు దుర్గాప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెల్ల రాల్చు పురుగుపై దృష్టి సారించాలి..

వాతావరణ పరిస్థితుల మార్పు వల్ల వరిలో రెల్ల రాల్చు పురుగు ఆశించే అవకాశం ఉందని, నివారణకు ముందుగా నీరు పెట్టి క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్ల వేప నూనె 5.0 లీటర్ల నీటిలో కలిపి సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలని, కోసిన పంటపై పురుగు ఆశిస్తే 1500 పీపీఎం వేపనూనెను లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల చొప్పున కలిపి పనల పైన, పనలు తిప్పి పిచికారీ చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరికోత దశలో ఉన్నట్లయితే వర్ష సూచన ఉన్నందున కోతలను వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే పైరు కోసి ఉంటే, కుప్పలుగా పెట్టుకుని టార్పాలిన్ పరదా కప్పాలన్నారు. లేదా నీడగా ఉన్న సురక్షిత స్థలంలో ఉంచి ఆరబెట్టాలన్నారు. తేమను ఉపయోగించుకుని నేలను దున్ని తయారు చేసుకుని వరి నారుమడి వేసుకోవాలన్నారు. ఎకరానికి 20-25 కిలోల వరి విత్తనం సరిపోతుందని, దుక్కిలో 5 సెంట్ల నారుమడికి 2.2 కిలోల యూరియా, 6.25 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్, 1.6 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. రాగల వర్షాన్ని సద్వినియోగం చేసుకుని రబీలో రాగి, నారు వేసుకోవచ్చని, ఎకరానికి 2.5 కిలోల విత్తనం సరిపోతుందని తెలిపారు. 5 సెంట్ల నారుమడికి 1.5 కిలోల యూరియా, 4 కిలోల సింగిల్ సూపర్ ఫాస్పేట్ 1.0 కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలన్నారు. బెల్లం రైతులు చెరకును నేలకు దగ్గరగా నరకాలని, చెరకు నరకిన 24 గంటల్లోపు బెల్లం ఆడుకోవాలని ఆయన పేర్కొన్నారు.



మార్టూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారి రంగాచారి

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు..

కశింకోట: మండలంలో ఖరీఫ్ వరి పంటపై రెల్ల రాల్చు పురుగు ఆశించి నష్టం కలిగిస్తున్నట్లు అనకాపల్లి నుంచి వచ్చిన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో డయాగ్నోస్టిక్ బృందం గుర్తించింది. మంగళవారం ఎన్టోమాలజీ శాస్త్రవేత్త, ప్రిన్సిపాల్ ఆర్. సరిత ఆధ్వర్యంలో ఈ బృందం కశింకోట, వెదురుపర్తి తదితర గ్రామాల్లో పర్యటించి అక్కడ వరి పంటను పరిశీలించింది. ఈ సందర్భంగా వరి కంకులలో రెక్కలను (రెల్లను) కొరికి నష్టం కలిగిస్తున్నట్లు గుర్తించి రైతులకు నివారణ మార్గాలను శాస్త్రవేత్త సరిత సూచించారు. వరి కోతకు 15 నుంచి 20 రోజుల వరకు సమయం ఉన్న వారు వేప నూనె 5 మిల్లీలీటర్లు క్లోరిపైరిపాస్‌గాని, ప్రొపినోపాస్ మందును 2 మిల్లీలీటర్లు గాని కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి కోత తర్వాత అయితే పనల మీద కూడా పురుగు ఆశించి రెల్లను కొరికి నష్టం కలిగించనున్న దృష్ట్యా పనలు తడిచే విధంగా వేప నూనెను 5 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. మందు సాయంత్రం వేళ పిచికారీ చేయడం ఉత్తమమన్నారు. ఆమె వెంట జిల్లా రిసోర్స్ కేంద్రం ఏవో పి. విజేత, ఏఈవో ఎ. నూకశ్రీనివాసరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రబీ పంటలకు బీమా తప్పనిసరి..

కశింకోట: మండలంలోని జెట్టపురెడ్డి తుని, చింతలపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎం. స్వప్న వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. రబీ పంటలకు బీమా చేయించుకోవాలని రైతులను కోరారు. మినుం పంటకు రూ.630, పెసర పంటకు రూ.300 వంతున బీమా సొమ్మును మీసేవా కేంద్రాల్లో చెల్లించాలన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు

అనకాపల్లి: పట్టణ పరిధిలో పరిమితికి మించి వాహనాలు వేగంగా నడిపిన డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ ఎం.శ్రావణి తెలిపారు. కొత్తూరులోని తన కార్యాలయంలో స్కూళ్లు, ఫ్యాక్టరీల యాజమాన్యాల డ్రైవర్లతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాహనాలు నడపాలని, అధిక లోడుతో వెళ్లే వానాలపై కేసులు నమోదు చేసి అపరాధ రుసుము విధిస్తామన్నారు. పార్కింగ్ స్థలాల్లో మాత్రమే వాహనాలు ఆపాలని, రహదారులపై విచ్చలవిడిగా వాహనాలు పార్కింగ్ చేసినట్లయితే సీసీ కెమెరాల ఆధారంగా కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రైవర్లు రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ఎం. వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణి

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ధర్మారావు



మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తూ ఎంపీపీ సూరిబాబు

అనకాపల్లి: స్థానిక డైట్ కళాశాల ఆవరణలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి అనకాపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గోరంట్ల ధర్మారావు మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని విలువలు, హక్కులు, బాధ్యతల ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు, ఎన్‌సీసీ ప్రొగ్రామ్ కన్వీనర్ అధికారి కె.మోహన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల మండల పరిషత్ కార్యాలయంలో..

తుమ్మపాల: మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ గొర్లి సూరిబాబు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కె.వి.నరసింహారావు, ఏవో ఎం.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ పి.వి.వి. ప్రసాద్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. గాంధీనగర్ ఎస్సీ హాస్టల్లో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ రేబాక మధుబాబు అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. భీమునిగుమ్మం డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ హైస్కూల్లో అంబేడ్కర్ విగ్రహానికి ప్రధానోపాధ్యాయురాలు రాణి, ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూల్లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మానవహారం నిర్వహించి రాజ్యాంగానికి కట్టుబడతామని ప్రమాణం చేశారు. రాజ్యాంగం ఆవశ్యకతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎంఆర్‌వీ అప్పారావు, పీడీ వి. ప్రభాకరరావు, ఉపాధ్యాయులు బి. అప్పారావు, కె. లక్ష్మీకాంతం, ఆర్. శేషుకుమారి, వరలక్ష్మి, సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి: మండలంలో మూలపేట గ్రామం గణేష్ నగర్‌కు చెందిన అయితా రమేష్ అదృశ్యమైనట్లు పట్టణ పోలీస్‌లకు మంగళవారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మూలపేట గ్రామానికి చెందిన రమేష్ సోమవారం సాయంత్రం నుంచి కనిపించడం లేదని అతని భార్య తులసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.